అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వర్షాలపై అధికారులతో వీసీలో సమీక్ష

గద్వాల, సెప్టెంబర్ 1 : జిల్లాలో వర్షప్రభావంపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతకుమారి, డీజీపీ జితేందర్ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో వరద ప్రభావిత పరిస్థితులపై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందునా ఎక్కడ కూడా ప్రాణ నష్టం చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని, వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. చేపల వేటకు, ఈత సరదా కోసం చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల వద్దకు ఎవరూ వెళ్లకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లో లెవల్ వంతెనలు, కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న మార్గాల గూండా వాహనాల రాకపోకలను నిషేధిస్తూ ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలని సూచించారు. చెరువులు, వాగులు, కుంటలు తెగిపోకుండా ముందస్తు అప్రమత్తతతో కూడిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లోఎస్పీ శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 1 : రాబోయే రెండు రోజులపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుశాఖ పరంగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తోట శ్రీనివాసరావు అదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చినా హెల్ప్ లైన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

గద్వాల, సెప్టెంబర్ 1 : భారీవర్షాల కారణంగా సెప్టెంబర్ 2న సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నందునా ప్రజావాణి రద్దు చేసినట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సిన నష్ట నివారణ చర్యలు, సహాయ పునరావాస కార్యక్రమాల ఏర్పాట్లు తదితర అంశాలపై అన్ని శాఖల అదికారులకు వారు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మ్యాన్‌హోల్స్ పక్కన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీవో ఉమాదేవి, ఈఈ మధుసుదన్‌రావు, మల్లయ్య తదితరులు ఉన్నారు.

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో నిరంతరం ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటికి రావొద్దని, జిల్లా పరిధిలోని

వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే

దవాఖానను సందర్శించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 1 : జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదివారం వేర్వేరుగా పర్యటించారు. జిల్లా కేంద్రంలోని 1, 6 వార్డుల్లో చిన్నారెడ్డి పర్యటించి ఇల్లు కూలిపోయిన బాధితులను పరామర్శించారు. రాయిగడ్డలో పాత ఇండ్లు కూలిపోగా, అధికారులు విచారణ చేపట్టారు. ఎమ్మెల్యే మెఘారెడ్డి పాతకోట, శ్వేతనగర్, బసవన్నగడ్డ, రామాటాకీస్ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రసూతి కేంద్రంలో వరద నీటిని బయటికి పంపేలా జేసీబీ సాయంతో చర్యలు చేపట్టారు. అక్కడే ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్ నూతన నిర్మాణంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. టీహబ్ నిర్వహణ, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. 14 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ఒక్కరూ లేకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేశ్, వైస్ చైర్మన్ కృష్ణ ఉన్నారు.

చెరువుకు గండి.. నీళ్లు ఖాళీ

గోపాల్‌పేట, సెప్టెంబర్ 1 : మండలంలోని బుద్దారం పెద్ద చెరువు అలుగు వద్ద ఆదివారం సాయంత్రం గండి పడి చెరువులోని నీరు ఖాళీ అవుతున్నది. కేఎల్ఐ నీటితో నిండిన చెరువుకు వర్షం నీరు తోడు కావడంతో నీటి వత్తిడి ఎక్కువై ఉధృతంగా నీరు దిగువకు పోతుంది. ఇలాగే కొనసాగితే చెరువు ఖాళీ కావడం ఖాయమని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాగు ఉధృతిని పరిశీలించిన కలెక్టర్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 1 : మండలంలోని అంకూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదివారం పరిశీలించారు. వాగు వద్ద రాకపోకలను నిలిపివేయించారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

గద్వాల టౌన్, ఆగస్టు 31 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో రామకృష్ణ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానలను, ల్యాబ్‌లను వైద్య సిబ్బందితో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా పాజిటివ్ వచ్చినట్లయితే టీడీ హబ్‌కు పంపించాలని సూచించారు. టెస్టుల పేర్లు, ధరల పట్టికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి దవాఖాననందు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బయో మెడికల్, పొల్యూషన్, ఫైర్ సర్టిఫికెట్లు తప్పక ఉండాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల వివరాలను ప్రతి రోజూ డీఎంహెచ్‌వో కార్యాలయానికి అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మధుసూదన్‌రెడ్డి, కృష్ణుడు ఉన్నారు. కాగా, జిల్లాలో వానలో కూడా సిబ్బంది తమ సర్వేను పూర్తి చేశారు. వ్యకిగత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FARM PLOTS SALE

★బాలానగర్ జడ్చర్ల బెంగళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో & యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ప్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి।। 7780483434.

NT-332573

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

అంకూరు వద్ద వాగు ఉధృతిని పరిశీలిస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

- రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం
- అప్రమత్తమైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- పలుచోట్ల కూలిన ఇండ్లు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 1 : మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలతో జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు అతలాకుతలమవుతున్నాయి. జిల్లా కేంద్రలోని తాళ్ల చెరువు, నల్ల చెరువు, ప్రధాన వాగుల్లో మట్టి దిబ్బలు, ముళ్ల పొదలు పేరుకుపోయి వరద నీరు సాఫీగా ప్రవహించడం లేదు. ప్రజలు, ప్రజాప్రతినిధులు రామా టాకీస్ వద్ద ముళ్ల పొదలను తొలగించారు. కలెక్టరేట్ సమీపంలో ఉన్న మర్రి కుంట చెరువుకు వరద పోటెత్తడంతో కాలనీలోని ఇళ్ల మధ్య వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజాప్రతినిధులు జనార్ధన్, రాజు, కాలనీవాసులు జేసీబీతో నీటిని మళ్లించారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..

వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే ప్రధాన కాల్వలు, డ్రైనేజీలు, కంపచెట్లను తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరుత్తినట్లు వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ చైర్మన్ ఫోన్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. అలాగే మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ ఫోన్ రింగ్ అవ్వడం తప్పా స్పందించరు. 9వ వార్డు సూర్యచంద్ర రోడ్డు ప్రధాన రహదారిపై డ్రైనేజీ గుంత పడింది. వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. నర్సింగ్ కళాశాల వద్ద మోకాళ్ల లోతుపైగా నీరు ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. రామా టాకీస్, బ్రహ్మంగారి వీధి, రాయిగడ్డ తదితర కాలనీల్లో మురుగు చేరుతుందోనని కాలనీవాసులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలోని మర్రికుంట చెరువును ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదివారం పరిశీలించారు. డీఎస్పీ కాలనీ, పోచమ్మ గుడిలోకి వర్షపు నీరును తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మహేశ్, కౌన్సిలర్ ఉన్నారు.

52.5 మిల్లీమీటర్ల వర్షపాతం..

మల్దకల్, సెప్టెంబర్ 1 : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. మండలంలో 52.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలపారు. నీడ్ పత్తి మురిగి నష్టం వాటిల్లితుందని ఆవేదన వ్యకం చేశారు.

దెబ్బ తిన్న ఇండ్ల పరిశీలన..

మండలంలోని నేతువానిపల్లిలో పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లను ఎస్సై సురేశ్‌గౌడ్ పరిశీలించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈయన వెంట హెడ్ కానిస్టేబుల్ పూజయ్య, మాజీ సర్పంచ్ వీరేశ్ నాయక్, ప్రజలు ఉన్నారు.

తెగిన నీలహళ్లి వాగు..

ధరూరు, సెప్టెంబర్ 1 : ధరూరు, కేటీదొడ్డి మండలాల సరిహద్దు గ్రామాలైన నీలహళ్లి, పాతపాలెం గ్రామాల మధ్య వాగు ఎడతెరిపి పారింది. రూ.3కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. అధికారులు మట్టితో ప్రత్యామ్నాయ రోడ్డు వేయించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అదివారం ఉదయం తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

42.4మి.మీ.లుగా నమోదు

గట్టు, సెప్టెంబర్ 1 : రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. శనివారం 19.4మి.మీ.ల వర్షపాతం నమోదుకాగా, ఆదివారం 42.4మి.మీ.ల వర్షపాతం నమోదైంది. చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కాగా గ్రామాన్ని ఎస్సై కేటీ మల్లేశ్ ఆదివారం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ సౌకర్యం నిలిచిపోయిందని గ్రామస్తులు వాపోయారు. అనంతరం ఆయన పోలీస్ వాహనంలో వెళ్లడానికి వెళ్లగా, మహిళలు అడ్డుకున్నారు. వరద భయంతో కొందరు గ్రామం వదులుతున్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో పోలీసులు తొలగించారు.

పండ్లనాటి రాగి వృక్షం నేలమట్టం..

గద్వాల రూరల్, సెప్టెంబర్ 1 : మండలoలోని జమ్మిచేడులోని జములమ్మ ఆలయం వద్ద ఏండ్లనాటి రాగి వృక్షం శనివారం రాత్రి నేటమట్టమైంది. రాగి వృక్షం కింద తాయమ్మ అమ్మవారిని భక్తులు కొలుస్తున్నారు. ఆర్‌ఆండ్‌బీ అధికారులు స్పందించి వృక్షాన్ని తొలగించారు.

రాకపోకలకు అంతరాయం..

గోపాల్‌పేట, సెప్టెంబర్ 1 : గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రేవల్లి మండలంలోని కేశంపేట-చెన్నారం, రేవల్లి-గుడిపల్లి మధ్య

కమాలుద్దీన్‌పూర్ కేఎల్ఐ కాల్వకు గండి పడి వృథాగా పోతున్న నీరు

బీచుపల్లి పుష్కర ఘాట్ వద్ద సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు

ధరూరు : తెగిపోయిన రోడ్డులో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వనపర్తి టౌన్ : మర్రికుంటకు వస్తున్న వరద

రేవల్లి-గుడిపల్లి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

జలదిగ్బంధం

పామాపురం చెక్‌డ్యాంపై ఉధృతంగా పారుతున్న వర్షపు నీరు

ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తల్పునూర్-రేవల్లి మధ్య కేఎల్ఐ మైనర్ కాల్వపై నుంచి రోడ్డు గండి పడింది. రేవల్లిలో 5 ఇండ్లు, శానాయిపల్లిలో ఒక ఇల్లు, తల్పునూర్‌లో ఒక ఇల్లు కూలినట్లు తాసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు. అదేవిధంగా గోపాల్‌పేటలో- 1, జయన్నతిరుమలాపురంలో- 1, ఏదుట్లలో ఒక ఇల్లు వానకు కూలినట్లు ఆర్ఐ యాదయ్య తెలిపారు.

పంట పొలాల్లోకి వరద..

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 1 : మండలంలోని అల్లమాయపల్లి సమీపంలో కమాలుద్దీన్‌పూర్ కేఎల్ఐ కాల్వకు గండి పడింది. దీంతో వరద నీరు పక్కనే ఉన్న పంట పొలాల్లో ప్రవహిస్తుంది.

బ్రాంచ్‌కెనాల్‌కు గండి

పెద్దమందడి, సెప్టెంబర్ 1 : మండలంలోని జంగమాయిపల్లి ఈర్లచెరువు వద్ద పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ కేఎల్ఐ కాల్వకు గండి పడడంతో చెరువు నిండి అలుగుపారింది. జగత్‌పల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. ఇన్‌చార్జి తాసీల్దార్ చక్రపాణి, ఆర్ఐ తిరుపతయ్య, నీటిపారుదల శాఖ ఏఈ కమలాసన్ తదితరులు పర్యవేక్షించారు.

చంద్రఘడ్‌లో కూలిన ఇల్లు

అమరచింత, సెప్టెంబర్ 1 : మండలంలోని చంద్రఘడ్‌లో పశుల వెంకటమ్మ ఇల్లు కూలిపోయింది. కాగా, ఇంట్లో నిద్రిస్తున్న తల్లీకూతుళ్లు వెంటనే తేరుకొని పరుగు తీయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు ఇంటిని పరిశీలించారు. ఎస్సై సురేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ గోపి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, కమిషనర్ నూరుల్ నదీబ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అధికారులు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును సందర్శించారు.

దవాఖానలోకి చేరిన వర్షపు నీరు..

ఆత్మకూరు, సెప్టెంబర్ 1 : పట్టణంలోని సర్కారు దవాఖానలోకి వర్షపు నీరు చేరి రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలైన ఆర్‌కే కాలనీ, అంబేద్కర్ కాలనీ వివిధ కాలనీల్లో రోడ్లన్నీ జలమయంగా మారాయి. చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. మదనాపురం సమీపంలోని ఊకచెట్టువాగు పారుతుండగా కొత్తకోటకు రాకపోకలు బంద్ అయ్యాయి. అదేవిధంగా అల్లీపూర్ వాగు బ్రిడ్జిపై పారుతుండడంతో ఆత్మకూరు నుంచి కురుమూర్తిజాతర, మహబూబ్‌నగర్ రాకపోకలు నిలిచిపోయాయి.

చిన్నంబావిలో భారీ వర్షం

చిన్నంబావి, సెప్టెంబర్ 1 : మండల కేంద్రంతోపాటు మండలంలోని గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. గడ్డ బస్వాపూర్ తదితర చెరువులు అలుగులు పారాయి.

సరళాసాగర్ మురిసింది..

మదనాపురం, సెప్టెంబర్ 1 : సరళాసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఆదివారం 7ఉడ్ సైఫన్లు, 3 ప్రైమరీ సైఫన్లు తెరుచుకున్నాయి. అధికారులు శంకర సముద్రం నుంచి రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. రామన్‌పాడ్ జలాశయానికి వరద వచ్చి చేరుతుండడంతో అధికారులు 5గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

వాహనాల మళ్లింపు..

పెబ్బేరు, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో పెబ్బేరు మండలంలో ఆదివారం నీళ్ల రోడ్ల పైకి చేరి పలు చోట్ల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై శేరుపల్లి, వెంకటాపురం వద్ద వాగులు పొంగి నీరు రోడ్డుపైకి చేరింది. కొల్లాపూర్ వెళ్లే వాహనాలను శ్రీరంగాపురం మీదుగా మళ్లించారు. అలాగే, రంగాపురం వద్దనున్న ఏబీడీ మధ్యం తయారీ కంపెనీకి వెళ్లే రోడ్డు కూడా నీటి ప్రవాహానికి మునిగిపోయింది. పోలీసులు ఈ రోడ్డును కూడా మూసివేసి రాకపోకలను నిలిపి వేశారు.

నిండిన చెరువులు, కుంటలు

పాన్‌గల్, సెప్టెంబర్ 1 : మండలంలోని కేతేపల్లిలో నాగులకుంట నిండి అలుగు పారింది. అదేవిధంగా కొత్త పేట, చింతకుంట, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో అలుగు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శాగాపూర్, కదిరేపాడు, దవాజీపల్లి గ్రామాల్లో కేఎల్ఐ కాల్వ కోతకు గురైంది.

కూలిన ఇండ్లు.. మునిగిన వరి పంట

కొత్తకోట, సెప్టెంబర్ 1 : మండలంలోని పాతజంగమయపల్లిలో వరిపంట నీటమునిగింది. సరళాసాగర్ బ్యాక్ వాటర్ రావడంతో వంద ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

కూలుతున్న మట్టిమిద్దెలు

పెబ్బేరు, సెప్టెంబర్ 1 : మండలంలోని అయ్యవారిపల్లి, పెంచికలపాడు, బున్యాదిపురం, కంచిరావుపల్లి తదితర గ్రామాల్లో సుమారు పది ఇండ్లు కూలిపోయినట్లు సమాచారం అందింది.

ఊకచెట్టువాగుపై ఉధృతంగా..

కొత్తకోట, సెప్టెంబర్ 1 : మండలంలోని పామాపురం సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. 36 అడుగుల శివుడి విగ్రహం చెక్‌డ్యాం సమీపంలో నిర్మించడంతో పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఈ చెక్ డ్యాం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో రూ.8కోట్లతో నిర్మించారు.

శంకరసముద్రం 5 గేట్ల ఎత్తివేత

కొత్తకోట, సెప్టెంబర్ 1 : ఎగువ నుంచి వర్షపు నీరు శంకరసముద్రం రిజర్వాయర్‌లోకి చేరుతుంది. దీంతో ఆదివారం సాయంత్రం 5గేట్లను ఎత్తినట్లు డీఈ భీమయ్య, ఏఈ అఖిల్ తెలిపారు. ప్రాజెక్టులోకి 5,250 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 6వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు తెలిపారు.

అధికారుల సహాయక చర్యలు

అలంపూర్, సెప్టెంబర్ 1: రెండు రోజులుగా కురుస్తు వర్షాలకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అప్రమత్తమైన మండల అధికారులు స్థానికంగా ప్రజలకు వర్షాభావ పరిస్థితులపై అవగాహన కల్పించారు. అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టారు.

అయిజ మండలంలో..

అయిజ, సెప్టెంబర్ 1: మండలంలో మూడురోజులు ఎడతెరిపిలేకుండా ముసురు వాన కురిసింది. ఆదివారం కురిసిన ముసురుకు జనజీవనం అతలాకుతమైంది. బయటకు వెళ్లాలంటే జనం ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జల మయమై బురద గుంటలుగా మారాయి. అయిజలోని ఒల్లూరు పేటలో ఓ ఇళ్లు గోడ కూలింది. మండలంలోని చెరువులు నిండి అలుగులు పారాయి. పట్టణానికి సమీపంలోని బింగిదొడ్డి చెరువు (మినీ ట్యాంక్ బండ్) అలుగు పారింది. చెరువు అలుగు పారడంతో వరద నీరు అయిజ పట్టణంలోని పెద్దవాగుకు చేరుతోంది. మండలంలోని ఉత్తనూర్ గంగమ్మ చెరువు, కొత్త చెరువు, చిన్నతాండ్రపాడు లింగమ్మ చెరువులు నిండుకుండల్లా మారాయి.

అయిజ : గుర్రంతోట వీధిలో కూలిన ఇళ్లు

ఆత్మకూరు సర్కారు దవాఖానలోకి చేరిన వర్షపు నీరు

మల్దకల్ : నేతువానిపల్లిలో ప్రవహిస్తున్న కాల్వ

175 ఇండ్లకు నోటీసులు

భారీ వర్షాలు కురుస్తుండడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా 175 ఇండ్లను గతంలోనే గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పిస్తూ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

వర్షానికి కూలిన గోడ

వడ్డేపల్లి, సెప్టెంబర్ 1: మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు మున్సిపాలిటీలోని వడ్డేపల్లిలో కుర్వ నాగన్నకు చెందిన ఇంటిగోడ కూలిపోయింది. ఎస్సై సంతోష్, నాయకులు దేవేంద్ర అక్కడకు చేరుకొని బాధితులను పరామర్శించి వారికి షెల్టర్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. ఇదే విధంగా పాతపడిన ఇండ్లు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

మానవత్వంచాటుకున్న పూల వ్యాపారి

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 1: మండలకేంద్రానికి చెందిన పూలవ్యాపారి మద్దిలేటి మానవత్వం చాటుకున్నాడు. ఆదివారం తన దుకాణంలో ఎర్రవల్లి మండలంలోని అన్ని చర్చీలకు అరటిపండ్లను వితరణ చేశాడు. దీంతో చర్చి సభ్యులు ప్రత్యేకప్రార్థనలు చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎర్రవల్లి గ్రామస్తులు అభినందించారు.

ఎర్రవల్లి మండలంలో..

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 1: మండలంలోని రెండు రోజులుగా కురుసుతన్న వానలకు వాగులు పొంగిపొర్లాయి. వదర నీరు పంటపొలాల్లోకి చేరి తీవ్రనష్టాన్ని మిగిలించింది. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గార్లపాడులోని పెద్దవాగు, షేక్‌పల్లి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అధికారులు స్పందించి సహాయక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచిన రాకపోకలు..

మానవపాడు, సెప్టెంబర్ 1: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, వంకలు పొంగి పొర్లడంతోపాటు పంట పొలాల్లోకి నీరు చేరి తీవ్ర నష్టం చేకూరింది. మండల కేంద్రం నుంచి అమరవాయికి వెళ్లే పెద్దవాగు, మానవపాడు నుంచి గోకులపాడు వెళ్లే వాగులు నిండుగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. మానవపాడు, నారాయణపురంలో ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నీరు నిలిచిన ప్రాంతాలను కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు పరిశీలించారు. మట్టి మిద్దెల్లో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

మాన్‌దొడ్డిలో కూలిన మిద్దె

రాజోళి, సెప్టెంబర్ 1: మండలంలోని మాన్‌దొడ్డిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు మట్టిమిద్దె కూలింది. గ్రామంలో బోయ చిన్న వెంకటేష్ కుటుంబ సభ్యులు శనివారం రాత్రి 12:30గంటలకు నిద్రిస్తుండగా వంటగది నుంచి పెద్ద శబ్దాలు రావడంతో ఉల్లిక్కిపడి చూడగా వంట గది కూలినట్లు గుర్తించి బయటకు పరుగులు తీశారు. కుటుంబ సభ్యులు వేరే గదిలో ఉండడంతో ప్రమాదం తప్పిందన్నారు. 150 కేజీలు బియ్యం, వంట వస్తువులు తడిచినట్లు తెలిపారు. పంచాయితీ కార్యదర్శి కూలిన మిద్దె వివరాలు సేకరించినట్లు తెలిపారు.

***కోతకు